

5

స్వాతంత్ర్యంగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు


# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 311 శుక్రవారం 13 డిసెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ట్రిపుల్ఆర్ ప్రాజెక్టుకు సాయం చేయండి..

### కేంద్రానికి సీఎంరేవంత్ రెడ్డి రిక్వెస్ట్ !

**రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ 2, మూసీ రివర్ ఫ్రంట్‌లకు నిధులు ఇప్పించండి..**

**మూసీ గోదావరి లింక్.. హైదరాబాద్ సీవరేజీ మాస్టర్ ప్లాన్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్‌కు చేయూతనివ్వండి.. సింగరేణికి కోల్ బ్లాక్‌లు కేటాయించండి..**



**న్యూ ఢిల్లీ డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త):** తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 తోపాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్%% సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా మొత్త రూ. 1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. మిగతా 2లో...

# జమిలికి ఆమోదం




## 'వన్ నేషన్ - వన్ ఎలెక్షన్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

- మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం



**న్యూ ఢిల్లీ డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త):** జమిలి ఎన్నికల(వన్ నేషన్ - వన్ ఎలెక్షన్)కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమిలికి ఆమోదముద్ర వేసింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. దేశంలో వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండటం... దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందని ఎన్డీయే ప్రభుత్వం తొలి నుంచి వాదిస్తున్న సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 18,626 పేజీల నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసింది.

మిగతా 2లో



2లో.

## పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్

- చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించి ఘనత సాధించిన గుకేశ్
- 18 ఏళ్లకే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారతీయుడు
- ఈ క్షణం కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్నాన్న గుకేశ్
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు

## ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం




2లో.

## ప్రభుత్వ ఆసుప్రత్రి పై పట్టింపు కరువు




3లో.

- మౌళిక వసతుల కల్పనపై నిర్లక్ష్య ధోరణి
- హెచ్ డి ఎఫ్ సి కమిటీ సమావేశాల్లేవు
- క్రమంగా డాక్టర్లు, సిబ్బంది వస్తున్నారో..లేదో?
- థంభింగ్ మిషన్ చూపిస్తున్న డిసిహెచ్ఎస్ రామ్మూర్తి
- ఇన్ కమింగ్ ఉంది సరే..! ఓట్ గోయింగ్ సంగతేంటి?
- తీగలకు సెలైన్ బాటిళ్లు పెట్టిన వైనం
- సెల్ ఫోన్లకే పరిమితమైన సిబ్బంది
- పెదవి విప్పని ఆసుపత్రి పెద్ద డాక్టర్
- పేషెంట్ తరుపు బంధువులకే దిక్కులేదు
- చెట్లకింద వ్యాపారస్తులెందుకు? పేషెంట్ తాలూకు బందువులు ఎక్కడ సేద తీరాలి?
- చిట్ట చివరికి పేరుమోసిన ఆసుపత్రి పరిస్థితి ఇలా తయారైంది
- ఇంకా ఎలాంటి పరిస్థితులు చూడాల్సి వస్తుందో మరీ

## ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నానన్న మంత్రి**

**రైతుకు బేడీలు వేసి తీసుకువెళ్లడం సరికాదన్న మంత్రి**

**అదానీ విషయంలో ఇక వివాదం వద్దని విజ్ఞప్తి**



హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): ఈ నెల 31వ తేదీలోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నానన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన నేతగా సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు మిగతా 2లో...

## బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

### తెలంగాణ పోలీసులు మరో దారుణం


- ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ
- ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక

2లో.



## పొరపాట్లకు తావులేకుండా సర్వే

- ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం
- సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం
- కలెక్టర్‌లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్
- మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ
- ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం వేగంగా అడుగులు
- దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధింపు




హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు.

# జమిలికి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
జమిలి ఎన్నికల బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం ముద్ర వేసింది.. ఈ మేరకు గురువారం మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై పార్లమెంట్ ముందుకు చర్చకు రానుంది. దేశంలో వేరువేరుగా ఎన్నికల నిర్వహణ.. దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందంటూ కేంద్రంలోని బీజేపీ మొదటి నుంచి వాదిస్తోంది.కాగా, రాబోయే సాధారణ ఎన్నికలు.. జమిలిగానే జరపాలని ప్రధాని నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకోసం వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. కానీ, పార్లమెంటులో రాజ్యాంగ సవరణలకు కూటమికి అవసరమైన సంఖ్యా బలం లేదు. అయినా ఈ బిల్లు ఆమోదించుకునేందుకు ముందుకెళ్లాలని మోదీ భావిస్తున్నారు. ముందుగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడతారు.కోవింద్ కమిటి సిపార్సులకు అనుగుణంగా..జమిలి ఎన్నికలపై గతంలోనే కోవింద్ కమిటి 18,626 పేజీల ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. 2023, సెప్టెంబర్ 2 ఈ నివేదిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. పలువురు నిపుణుల సారధ్యంలో 191రోజుల కసరత్తు అనంతరం ఈ నివేదికను పూర్తిచేశారు. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని, తరువాతి 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ ఈ నివేదికలో సిఫారసు చేసింది.కోవింద్ కమిటీ తన నివేదికలో ఏకకాలంలో ఓటు వేయడం దేశప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో సహాయ పడుతుందని పేర్కొంది. ఒకేసారి ఐక్యంగా ఓటు వేయడం అనేది అభివృద్ధి ప్రక్రియను, సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రజాస్వామ్య పునాదిని మరింత బలోపేతం చేస్తుందని తెలిపింది. ఏకకాలంలో ఓటింగ్ జరగడం వల్ల పారదర్శకత, సౌలభ్యం, ఓటరు విశ్వాసం గణనీయంగా పెరుగుతుందని కోవింద్ కమిటీ భావించింది.ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు, సిబ్బంది, భద్రతా దళాల ముందస్తు ప్రణాళికను ఈ కమిటీ సిఫారసు చేసింది. తొలిసారిగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు ఉండవచ్చని నివేదిక పేర్కొంది. హంగ్ హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం జరిగితే, మిగిలిన ఐదేళ్ల కాలానికి తాజా ఎన్నికలు నిర్వహించవచ్చని కోవింద్ కమిటీ పేర్కొంది.

# ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చు

(మొదటి పేజీ తరువాయి)
మేడ్చల్, రంగారెడ్డి అక్రమార్కుల చిట్టాను త్వరలో విప్పుతామని హెచ్చరించారు.లగచర్ల కేసులో అరెస్టై జైల్లో ఉన్న రైతును ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో బేడీలు వేయడం సరికాదని మంత్రి అభిప్రాయపడ్డారు. అదానీ విషయంలో ఇక వివాదం వద్దని... ఆయన ఇచ్చిన రూ.100 కోట్లను తమ ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందని స్పష్టం చేశారు. హాస్టళ్లకు పెండింగ్ బిల్లులను ఈ నెల 31వ తేదీ లోగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఉక్కు కర్మాగారం గురించి ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు.అసెంబ్లీలో ప్రజలకు సంబంధించిన అంశాలు చర్చకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి సభ్యుడు సభ విలువను కాపాడాలని, ప్రజాస్వామ్యయుతంగా చర్చకు రావాలన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతులు ముగిశాయి.అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ... ఈరోజుతో శిక్షణా తరగతులు ముగిశాయన్నారు. తెలంగాణ మూడో శాసన సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శాసనసభా వ్యవహారాల శాఖ రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించిందన్నారు. శాసనసభ, మండలిలో సమర్థవంతంగా ప్రజల అంశాలు చర్చకు రావాలన్నారు.ప్రజల కోసం ఏం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయో అది నెరవేరే విధంగా సభ్యులంతా సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలకు శాసనసభ వేదిక అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# జర్నలిస్ట్ రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

- సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీఎస్ జేయు బృందం
- చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చెపట్టాలి
- జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- టీఎస్ జేయు డిమాండ్



హైదరాబాద్ బ్యూరో,
డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త):
ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లుగా జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని గురువారం టీఎస్జేయు రాష్ట్ర కమిటీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా 10 లక్షల రూపాయల ఉచిత జీవిత బీమా సదుపాయం కల్పించాలని, టీఎస్ జేయు నాయకత్వం మంత్రిని కోరింది. అక్రిడేషన్ల కమిటీలు పునరుద్ధరణ చేసి, జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా, జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను జర్నలిస్టుల అందరికీ అందేలా చూడాలని కమిటీ కోరింది. రాబోయే అక్రిడేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్ట్ సంఘాలకు భాగస్వామ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజ్ పటేల్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు క్రాంతి కుమార్, అశోక్ తదితరులు ఉన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**
1. చిన్న పత్రికలను తక్షణమే ఎంపానెల్మెంట్ లు చేయాలి 2. సంక్షేమ పథకాలలో యూనియన్ల జోక్యం లేకుండా చూడాలి, జర్నలిస్టుల సంక్షేమ పథకాలు నేరుగా అమలు చేయాలని, యూనియన్ల జోక్యం లేకుండా వ్యవస్థను మెరుగుపరచాలి.
3. మీడియా రంగానికి ప్రత్యేక పాలసీ రూపొందించి, జర్నలిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలి. 4. మీడియా ఉద్యోగుల సంక్షేమం జర్నలిస్టుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన బీమా, పెన్షన్, ఇతర ఆర్థిక సహాయ కార్యక్రమాలను విస్తరించాలి.

# బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

**తెలంగాణ పోలీసులు మరో దారుణం**
**ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ**
**ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం**
**ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక**



హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త):
ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు.భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే%ొ%.అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి%ొ% ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం%ొ%.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం%ొ% చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది.ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

# ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు సాయం చేయండి..

(మొదటి పేజీ తరువాయి)
ఆర్ఆర్ఆర్ నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని.. త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్ఏఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్ లు, లాజిస్టిక్ పార్క్‌లు, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయని సీఎం అన్నారు.ఆర్ఆర్ఆర్ రెండు వైపులా పూర్తికి ఈ రహదారికి సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు అని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు.ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 10 గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఓఆర్ఆర్ అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతాయని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్ చెరు, ఎల్‌బీ నగర్-హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీల నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50: 50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేప్టటేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆ భూముల బదలాయింపుతో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశామని, నిధుల మంజూరుతో పాటు అనుమతులకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

# పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్

**న్యూ ఢిల్లీ డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త):**
భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లలో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు.18 ఏళ్ల వయస్సులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారని తెలంగాణ సీఎంవో ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. 18 ఏళ్ల వయస్సులో ఏం చేయాలని చాలామంది ఆలోచిస్తుంటారని, అలాంటి వయస్సులో గుకేశ్ రికార్డ్ సృష్టించారని కేటీఆర్ పేర్కొన్నారు.
అత్యంత పిన్న వయస్సులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్ నిలిచారని, ఇది చారిత్రాత్మక, ఎంతోమందికి ప్రేరణను ఇచ్చే విజయమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విజయం అతని అసమాన ప్రతిభకు, నిరంతర కృషికి, అచంచలమైన సంకల్పానికి నిదర్శనమన్నారు.
చెస్ రంగంలో గుకేశ్ తన విజయాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు పెద్ద పెద్ద కలలు కనే యువతకు ప్రేరణగా నిలుస్తాడన్నారు. అంకితభావం, అభిరుచితో ఏదైనా సాధించవచ్చని గుకేశ్ తన విజయం ద్వారా వెల్లడించారన్నారు. గుకేశ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**మరెన్నో విజయాలు సాధించాలి: కిషన్ రెడ్డి**
2024 ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచినందుకు గుకేశ్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గుకేశ్ విజయంతో యావత్ దేశం గర్విస్తోందన్నారు. గుకేశ్ ఈ రంగంలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**ఔత్సాహిక ప్రతిభావంతులకు స్ఫూర్తి: బండి సంజయ్**
గుకేశ్ విజయం ఈ దేశానికి కూడా గొప్ప మైలురాయి అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఔత్సాహిక ప్రతిభావంతులకు గుకేశ్ స్ఫూర్తిగా నిలిచారన్నారు.


**చిన్న వయస్సులో రికార్డ్ సృష్టించారు: కేటీఆర్**
మనలో చాలామంది 18 ఏళ్ల వయస్సులో ఏం చేయాలా? అని ఆలోచిస్తుంటారని, కానీ అదే వయస్సులో మీరు అద్భుతమైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ గెలిచిన గుకేశ్‌కు అభినందనలు తెలిపారు. ఇది ఆయన కుటుంబానికే కాకుండా ఈ దేశానికే గర్వించదగ్గ క్షణాలు అన్నారు. గుకేశ్ ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిపై పట్టింపు కరువు

## మౌళిక వసతుల కల్పనపై నిర్లక్ష్య ధోరణి

- హెచ్ డి ఎఫ్ సి కమిటీ సమావేశాల్లేవు
- క్రమంగా డాక్టర్లు, సిబ్బంది వస్తున్నారో..లేదో?
- థంభింగ్ మిషన్ చూపిస్తున్న డిసిహెచ్ఎస్ రామ్మూర్తి
- ఇన్ కమింగ్ ఉంది సరే..! ఓట్ గోయింగ్ సంగతేంటి?
- పెదవి విప్పని ఆసుపత్రి పెద్ద డాక్టర్
- పేషెంట్ తరుపు బండువులకే దిక్కులేదు
- చెట్లకింద వ్యాపారస్తులెందుకు?
- పేషెంట్ తాలూకు బందువులు ఎక్కడ సేద తీరాలి?
- చిట్ట చివరికి పేరుమోసిన ఆసుపత్రి పరిస్థితి ఇలా తయారైంది
- ఇంకా ఎలాంటి పరిస్థితులు చూడాల్సి వస్తుందో మరీ







**వర్ధన్నపేట, డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టింపు కరువైందని చెప్పాలి. మౌళిక వసతుల కల్పనపై ఆసుపత్రి నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణి దర్శనమిస్తుంది. ఇటీవల వాతావరణంలో ఏర్పడుతున్న చలి తీవ్రతతో పాటు వివిధ రకాల మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నారు. వివిధ రకాల సమస్యలతో వర్ధన్నపేట మండల పరిధిలోని ప్రజలు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. డాక్టర్లు ఒకరా? లేక ఇద్దరు మాత్రమే ఆసుపత్రికి వస్తూ వెళుతుంటారు. మిగతా సమయంలో సిబ్బంది మాత్రమే చికిత్స అందిస్తుంటారు. ఇదిలా ఉండగా నూతనంగా నిర్మించిన పై భాగంలోని గదులలో జ్వరం కారణంగా ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళకి గ్లూకోస్ బాటిల్ పెట్టారు. పాపం ఆసుపత్రి పూర్తిస్థాయిలో నష్టాల్లో ఉన్న కారణంగా, ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించకపోవడంతో గ్లూకోస్ బాటిల్లు సన్నని ఐరన్ తీగలకు బాటిల్స్ కట్టి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్లూకోస్ బాటిల్ పెట్టిన తర్వాత నర్సులకు పెద్దగా ఏం పని ఉండదని ఒక నర్స్ నిదర్శనమిచ్చింది. ఒకవైపు అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులంతా చికిత్స పొందుతూ ఉంటే, విధుల్లో ఉన్న సమయంలో ఫోన్ మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది ( నర్స్ ) కాలయాపన చేస్తోంది. అదే సమయంలో ఎవరికైనా ఏదైనా అనివార్య కారణాలవల్ల ప్రమాదం సంభవిస్తే ఎలా? అన్న అనుమానాలతో చికిత్స పొందుతున్న వారంతా ఆమె వైపు ఆశ్చర్యంగా చూడ సాగారు. ఇట్టి విషయమై డి సి హెచ్ ఎస్ డాక్టర్ రామ్మూర్తి ని వివరణ కోరగా, వాస్తవానికి గ్లూకోస్ పెట్టాల్సిన స్టాండ్లు తెప్పించాలి కానీ కొంచెం ఆలస్యం అవుతుందని అన్నారు. మెటీరియల్స్ కావాలని ఆర్డర్ చేయడం జరిగింది కానీ కొంచెం సమయం పడుతుందనిసమర్ధించుకుంటున్నారు.

### డాక్టర్లు సిబ్బంది ఏ సమయానికి వస్తారు? ఎప్పుడు తిరిగి వెళతారు?

ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు, సిబ్బంది ఏ సమయానికి ఆసుపత్రిని చేరుకుంటారు? ఎంతమంది ఉదయం సమయానికి విధులు నిర్వర్తిస్తారని వివరణ కోరగా డాక్టర్ రామ్మూర్తి బదులిచ్చిన ప్రకారం డాక్టర్లు సిబ్బంది ఉదయం పూట సమయానికే వస్తుంటారు. కాకపోతే షిఫ్టింగ్ ప్రకారమే వస్తు, విధులు నిర్వర్తిస్తుంటారని చెప్పారు. వారు వస్తున్నారని అనడానికి థంభింగ్ మిషన్ ఆధారమని అంటున్నారు. ఆ మిషన్ ఇన్ కమింగ్ వేలిముద్ర వేయడం వరకు ఓకే, తిరిగి ఔట్ గోయింగ్ సంగతి ఏంటని ప్రశ్నిస్తే వారి దగ్గర సమాధానం లేకపోయి పెదవి విప్పడం లేదు. నిజం చెప్పాలంటే ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లలో కొందరికి దాదాపుగా సొంతంగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. అందువల్లే ఏదైనా అత్యవసరమైతే తప్ప ఆసుపత్రికి వచ్చే ప్రసక్తి ఉండదు. తనిఖీలు చేయడానికి వచ్చే అధికారులను, ప్రజా ప్రతినిధులను, ఇతరాత్రులను నమ్మబలికించే విధంగా రికార్డులు తయారు చేసి సిద్ధంగా ఉంచుతారన్న ఆరోపణ ఆసుపత్రి ప్రాంగణంలో చర్చనీయాంశంగా మారింది.

### పేషెంట్ తాలూకు బందువులకే నిలువ నీడ లేదు

ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు సంబంధించినపేషెంట్ తరుపు పేరెంట్స్ కే నిలువ నీడ లేని పరిస్థితి దాపురించింది. వర్షం వచ్చినా, ఎండలు విఫరీతంగా కొట్టినా, అధికంగా చలి తీవ్రత పెరిగినా చెట్లకింద సెడతీరాలి అంతే. అలాంటిది ఉన్న చెట్లకింద వ్యాపారస్తులకు చేర్చుకున్నారు. తాను దూర సందులేదు మెడకేమో డోలు అన్న చందంగా పేషెంట్ తాలూకు బందువులు ప్రస్తుతం బజారుపై నించివాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారని బాధితుల తరుపు వారు వాదిస్తున్నారు. వర్ధన్నపేట పేరుమోసిన ఆసుపత్రి తిరిగితిరిగి ఇలాంటి పరిస్తికి చేరుకుంది మరీ..



### చదువు చారెడు బలపాలు దోచేడు

60 పడకల ఆసుపత్రికి డాక్టర్లు 38 మంది ఉన్నారు. సిబ్బంది 40 మంది ఉన్నారు. చదువు చారెడు, బలపాలు దోచెడు అన్న చందంగా పేషంట్ల కంటే డాక్టర్లు, సిబ్బంది సంఖ్యే పెద్దదిగా వుంది. ఇదే అదునుగా తీసుకున్న డాక్టర్లు, సిబ్బంది తనదైన శైలిలో డ్యూటీలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారనడానికి ఆశ్చర్యం లేకపోయింది. దాదాపుగా సిబ్బంది ఒక్కొక్కరికి 8 గంటల సేవలు మాత్రమే. అందులో ఎవ్వరు ఎప్పుడు వస్తారో తెలియదు. అలా సిబ్బంది పనితీరు ఉండగా, డాక్టర్లు మాత్రం వారానికి 1 లేదా రెండు రోజులు విధులు నిర్వహిస్తే చాలు అన్నచందంగా ఆసుపత్రి సేవలు తయారయ్యాయి. ఇలాంటి పరిస్థితులు ఎప్పుడు చక్కబడతాయో తెలియని పరిస్థితి చోటు చేసుకుంది





# రైతుకు బేడీలు వేయడం అమానవీయం

**రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం లగచర్ల రైతులకు అండగా ఉంటాం**

**గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

# ఛతీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 12మంది మావోయిస్టులు మృతి

బస్తర్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

# విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం

## చలికివణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): రాష్ట్రంలో గురుకులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్ధతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.



# స్వాతంత్ర్యంగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు

- స్థానిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు
- కళ్ళ ముందే ప్రతిరోజు ఇసుక రవాణా కొనసాగుతోంది
- అడ్డుకోవాలని ఆలోచన అధికారులకు ఎందుకు రావడం లేదు?
- స్థానికుల అభిప్రాయం మేరకు ముడుపులే కారణమా?
- ఆకేరు వాగులో తవ్వకాల కారణంగా గుంతలు ఏర్పడ్డాయి
- ఇసుక వాగులో కనిపించకపోవడంతో వ్యవసాయ భూములపై పడ్డారు
- వాగు ప్రక్కన రైతులతో వాగ్వివాదం చేసి భూములు కాజేశారు
- వ్యవసాయ భూముల్లో వెలువడుతున్న ఇసుకను తవ్వకాలు చేస్తున్నారు
- స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారుల హస్తంతోనే
- ఈ తతంగం కొనసాగుతుందన్న ఆరోపణలు
- పగలు రాత్రి తేడాలు లేకుండా తవ్వకాల నిర్వహణ సాగుతోంది
- జెసిబి మిషనరీలతో తవ్వకాలు చేస్తూ, ఇసుకను
- ఫిల్టర్ చేయడానికి మోటర్లు వాడుతున్నారు
- మోటార్లకు కరెంటు అక్రమంగా వినియోగించుకుంటున్నారు
- ఇన్ని రకాలుగా ప్రభుత్వ ఖజానకు గండి కొడుతుంటే
- సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు?
- అనేక రకాల అనుమానాలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి
- అధికారుల నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేలా అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి

**పర్వతగిరి, డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త):** పర్వతగిరి మండల పరిధిలోని ఇసుక మాఫియా రాజ్యమేలుతుంది. ఆకేరు వాగు నుండి జెసిబిల సహాయంతో టన్నుల కొద్దీ ఇసుక స్వతంత్రంగా బయటికి తీస్తున్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ట్రాక్టర్లు, డిసిఎంల ద్వారా ప్రతీ రోజు మండలం దాటేస్తున్నాయి. వరంగల్ జిల్లాలోని సంగెం, వరంగల్, నెక్కొండ, చెన్నారావుపేట, నర్సంపేట తదితర చుట్టు పక్కల మండలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఆకెరు వాగు పరిసరాల్లో వాగు ప్రాంతమంతా గుంటలమయంగా మారుతుంది. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని వాగుని తవ్విన తవ్వకాసురులు అంతటితో ఆగకుండా ప్రక్కనే ఉన్న వ్యవసాయ భూములలో సాగు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతూ, చాలాకాలంగా రైతులను వ్యవసాయం చేయకుండా పంచాయితీలకు దిగుతున్నారు. తవ్వకాసురుల దౌర్జన్యం భరించలేని కొందరు రైతులు తవ్వకాసురులకే తక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారని సమాచారం. అలా స్వాధీనం చేసుకున్న భూముల్లో లభ్యమవుతున్న ఇసుక మెటల్ దర్జాగా తవ్వుతూ, స్థానిక అధికారుల సహకారంతో ఇసుక రవాణా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతుందని చెప్పవచ్చు. ఈ తతంగమంతా స్థానిక అధికారుల కళ్ళ ఎదురుగానే జరుగుతుంది. ఐనప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల స్థానికంగా జరుగుతున్న చర్చ నిదర్శనమనిపిస్తుంది. నెలసరి మామూళ్లు తీసుకుంటూ ప్రభుత్వ నిషేధిత అక్రమ ఇసుక రవాణాకు కొమ్ముకాస్తున్నరని మండల కేంద్రంలో బహిరంగ చర్చ సాగుతోంది. పర్వతగిరి మండలం సీ.ఎం.తండా, రోళ్ళకల్, నారాయణపురం గ్రామాల్లోని ఆకేరు వాగు నుండి నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్ల ద్వారా, లైసెన్సులు లేని డ్రైవర్ల(మైనర్)తో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్, విద్యుత్ శాఖా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మరిన్ని విమర్శలకు దారి తీస్తుంది. ఒకటి కాదు, రెండు కాదు, వందల ట్రాక్టర్లతో పంట భూములను నాశనం చేస్తూ, రైతులను బెదిరింపులకు గురిచేస్తూ, టన్నుల కొద్ది ఇసుకను తవ్వి రవాణా చేసి, లక్షల్లో అక్రమంగా సొమ్ముచేసుకుంటూ, చూస్తూ వుండగానే ధైర్యంగా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు మాత్రం 'వాటా'లకు పాట పాడుతూ 'వాల్టా' చట్టానికి తూటాలు పెడుతున్నారు. చట్టాలను పరిరక్షించాల్సిన ' రక్షక ' వ్యవస్థ వసూల్ దందాకు తెరలేపి, చట్టాలను అతిక్రమిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి పోతున్నా, కరెంట్ మోటార్ల సహాయంతో కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ, అక్రమ వ్యాపారం చేస్తు, ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారు. సామాన్య ప్రజలు కరెంటు బిల్లు కట్టడం ఒకటి రెండు నెలల ఆలస్యమైతే కరెంటు వైర్లు కట్ చేసి, కరెంటు నిలిపివేసే విద్యుత్ అధికారులు, అక్రమ ఇసుక రవాణా దారులు ప్రతి రోజు యూనిట్ల కొద్ది అక్రమ విద్యుత్ వాడుతున్నా, ఆమ్యామ్యాల కక్కుర్తి పడి, అక్రమంగా విద్యుత్ వాడుతున్న అక్రమార్కులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు? అక్రమార్కులతో వారూ చేతులుకలిపారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా ప్రభుత్వ నిషేధిత ఇసుక తవ్వకాలు ఏళ్ల తరబడి ఎలా చేస్తున్నారా? అన్న విషయమై కాస్త ఆరాతీస్తే అనేక అనుమానాలు వెలుగు చూస్తున్నాయి. స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులే కాదు, జిల్లాకు చెందిన మైనింగ్ అధికారులు ఇందులో భాగస్వామ్యులేనన్న



ఆరోపణలు పలువురు స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. భూగర్భ జలాలు, సారవంతమైన భూమి, పర్యావరణాన్ని కాపాడుటకు 'వాల్టా' చట్టాన్ని రూపొందించారు. ఈ వాల్టా చట్టం పర్వతగిరిలో ఇసుక దందాపైన పనిచేయడం లేదన్న ఉద్దేశ్యంతో ప్రజలు వాపోతున్నారు. ఇసుకను తవ్వకాలు మండల పరిధిలో వ్యాపారంగా మారిందనడానికి ఆశ్చర్యం లేకపోయింది. రెచ్చిపోయి కొనసాగిస్తున్న దందావైపు కనీసం సంబధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం వల్ల అనేక విమర్శలు వ్యక్తమౌతున్నాయి. వాల్టా చట్టం అనేది పేదవారిపై ఉపయోగించడానికి తప్ప, ఇసుక రవాణ చేస్తున్న వారిపై పనిచేయదని స్థానికులు నిర్ధారణకు వస్తున్నారు. విచ్చలవిడి రవాణా కారణంగా రహదారులు ధ్వంసమైపోతున్నాయి. ఇప్పటికైనా జరుగుతున్న విధ్వంసంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, చట్టపరమైన చర్యలు తీసుకుని వారి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని స్థానికులు అంటున్నారు.







# గత పాలనలో తెలంగాణ తల్లి విగ్రహం దొరసాని రూపం

## ఈ ప్రభుత్వ పాలనలో తెలంగాణ తల్లిగా పటేలమ్మ రూపం

**- తెలంగాణ తల్లిగా చాకలి ఐలక్కను మర్చిపోవడం బాధాకరం**

**- గతంలో ఐలక్క పేరు ప్రకటించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ**

**- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ**

**వరంగల్, డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త):** గత ప్రభుత్వ పాలనలో వెలమ దొర కెసిఆర్ తెలంగాణ తల్లి దొరసాని రూపకల్పన చేయడం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ సిఎం రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ తల్లి పటేలమ్మగా రూపకల్పన చేయడం జరిగిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ అభిప్రాయం వ్యక్తం చేశారు. నిజానికి అసలైన మన తెలంగాణ తల్లిని రూపకల్పన చేయలేకపోతున్నారు. ఎందుకంటే వారు అగ్రవర్ణాలు కాబట్టి, ఆ ఇద్దరు ఒక్క తాను ముక్కలే అన్నారు. ఈ తెలంగాణలో తెలంగాణ తల్లి అంటే మహా జనుల ఆత్మగౌరవ ప్రతీక, తాడిత, పీడిత, అణగారిన వర్గాల పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకురాలు, గడీల దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అసువులు బాసిన నిజమైన నికాలాస్ మహాజనుల తెలంగాణ తల్లి చాకలి ఐలక్కనే అన్నారు.




ఈ ప్రస్తావన గతంలోనే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గుర్తు చేశారని తెలిపారు. ఈ తెలంగాణ ప్రజలకు చాకలి ఐలక్కనే మన తెలంగాణ తల్లి, తెలంగాణ తల్లి రూపకల్పన చేయాలంటే చాకలి ఐలక్కనే తెలంగాణ తల్లి రూపకల్పన చేయాలని గత ప్రభుత్వాలకు చెప్పడం జరిగిందన్నారు. దొరబోయి రెడ్డి వచ్చే ఏమి మారిందంటే తెలంగాణ తల్లి పేరుతో దొరసాని ఫోటో బదులుగా పటేలమ్మ ఫోటో వచ్చిందని రాష్ట్రమంతా ప్రచారం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ తల్లి చాకలి ఐలక్కను మర్చిపోవడం యావత్తు తెలంగాణ రాష్ట్రానికే అవమానకరమని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం చాకలి ఐలక్క రూపకల్పన తెలంగాణ తల్లిగా ప్రకటించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. మహా జనులంతా ఈ అవమానకరమైన పరిస్థితి గమనించాల్సిన అవసరం ఉందన్నారు.

# పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

## : సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే



వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా? అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా? వేరే రాష్ట్రానికి వెళ్లారా? అని చురక అంటించారు.

# జనగాం సహా నాలుగు జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

**ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వకపోవడంపై నోటీసులు**

**జనగాం, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లకు నోటీసులు**

హైదరాబాద్,డిసెంబర్ 12,(జర్నలిస్టు వార్త): ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం విషయమై జనగాం సహా నాలుగు జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.రైతు ఆత్మహత్యలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గత ఏడాది హైకోర్టులో విచారణ జరిగింది. పరిహారం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని అప్పుడు ప్రభుత్వం... కోర్టుకు తెలిపింది. అయితే ఏడాది దాటినప్పటికీ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదంటూ కొండల్ రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నాలుగు జిల్లాల కలెక్టర్లకు నోటీసులు ఇచ్చింది. ఈ పిటిషన్‌ను కోర్టు దిక్కరణ కింద ఎందుకు స్వీకరించకూడదో చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొంది.

## ఆటలు మానసిక ఉల్లాసనికి దోహద పడుతాయి

### - మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలు



**నల్లగొండ/ డిసెంబర్ 012 (జర్నలిస్ట్ వార్త):** ఆటలు మానసిక ఉల్లాసనికి దోహద పడుతాయని మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలు అన్నారు. గురువారం చింతపల్లి మండలంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఆటల పోటీలను మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదేశాల మేరకు ఆటల పోటీ కార్యక్రమాని ప్రారంభించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలోనీ విద్యార్థులు, యువకులు ఆటలలో ఉండే ప్రతిభను వెలికి తీసేందుకు ప్రవేశపెట్టిన సీఎం కప్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఆటల పోటీలలో మండలంలోని ప్రతి పాఠశాల నుండి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలిచిన వారిని జిల్లా స్థాయిలో జరగబోయే పోటీలకు పంపిస్తామన్నారు. ఆటల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన పీడీలు, పిఈటిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలు, వసతి గృహాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త):** ఈనెల 14వ, తేదీన జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల నెలవారీ డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు పై ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 14న, నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంబంధిత గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను తెలిపేలా బ్యానర్లను ప్రతి గురుకుల హాస్టల్ లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గురుకుల, విద్యాసంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను, కాస్మోటిక్ చార్జీలను విద్యార్థినులకు 275, విద్యార్థులకు 200 రూపాయలు పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. అన్ని కులాల పేద విద్యార్థులకు మెరుగైన వైద్య కల్పనే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కలిగిస్తుందన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఈఓ జ్ఞానేశ్వర్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ అధికారులు పుష్పాలత, పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, సౌజన్యలతో పాటు అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ, పాఠశాలల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నారి ఈశ్వరానంద ప్రతిభ పురస్కారం



బోథ్ /డిసెంబర్ 012 (జర్నలిస్ట్ వార్త): బోథ్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌట 'బి'లో జరిగిన కార్యక్రమంలో ఇదే పాఠశాలలో చదివి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి గత నెలలో పదవి విరమణ పొందిన పొన్నారి నాగభూషన్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ పాఠశాల విద్యార్థుల కోసం 2007 నుండి 2023 వరకు పదవ తరగతిలో ప్రతిభ సాధించిన మొదటి, రెండవ ర్యాంకు విద్యార్థులకు గురువారం ప్రోత్సాహకాలను అందిచారు . ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండి, క్రమశిక్షణతో చదివి, ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులను ప్రేమించాలన్నారు. పెద్దలపట్ల మర్యాదలు కలిగి ఉండాలని తెలియజేశారు. 2023-24 సంవత్సరములో పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినికి 5100 రూపాయలు రెండవ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులకు 2100 రూపాయల చొప్పున నగదు బహుమతి అందించారు. అలాగే తాను పదవి విరమణ పొందాను కాబట్టి ఈ పురస్కారాన్ని నేటితో ముగిస్తున్నానని ప్రకటిచారు. విద్యార్థుల భోజనానికి ప్లేట్ల సదుపాయం కొరకు 5000 రూపాయలు విలువ గల 55 ప్లేట్లను విద్యార్థులకు అందజేయడం జాతిగిందాన్నారు. 2024-25 వ సంవత్సరంలో 8, 9, 10 వ తరగతి విద్యార్థుల లలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి అధ్యక్షులు బి శ్రీకాంత్ రెడ్డి మండల విద్యాధికారి కే .పోశెట్టి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌట బి ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క పర్యటన విజయవంతం చేయ్యాలి

### - నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్



బోథ్/ డిసెంబర్ 012(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క పర్యటన విజయవంతం చేయ్యాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గురువారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలో గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం, నేరడిగొండ మండలంలో లకంపూర్ ఆశ్రమ పాఠశాల సందర్శన, బోథ్ ఎక్స్ రోడ్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కుంటాల సోమన్న హరితవనాన్ని ప్రారంబొచ్చావనికి శనివారం నాడు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు, ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వస్తుందన్నారు. మండల కేంద్రంలో నూతన సబ్ రిజిస్టర్ భవనాన్ని ప్రారంభిస్తారు, దాదాపు 400 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చెయ్యాలని కోరారు.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా







వరంగల్ బ్యూరో, డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల(ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణితో పాటు గురువారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి 3 నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. ఈ తనిఖీలో నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి శ్యామ్ సుందర్, ఏఐఎంఐఎం ఫైజోద్దీన్, బిజెపి హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల్లో ర్యాగింగ్ ను నిర్మూలించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా - విద్యార్థుల హాజరు డ్రాప్ ఔట్ లేకుండా చూడాలి



వరంగల్ బ్యూరో, డిసెంబర్ 12,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు, మానసిక స్థైర్యం, తదితర అంశాలను కళాశాల యాజమాన్యాలు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య శారదా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని కళాశాలల్లో ఆంటీ-డ్రగ్ కమిటీలు, టెలీమానస్, పరీక్ష ఫీజుల చెల్లింపు, అడ్మీషన్లు, డ్రాపవుట్ విద్యార్థుల హాజరు మెరుగు పర్చుకోవడంపై చర్యలు, పేరెంట్స్ కమిటీ మీటింగ్ తదితర అంశాలపై నివేదికలు సేకరించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలై పోతున్నారని, చదువుమీద, కుటుంబ బాధ్యతలపట్ల తల్లిదండ్రుల పట్ల నిరంతరం వారితో మాట్లాడాలని అన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో అధ్యాపకులు ప్రణాళిక బద్ధంగా బోధన చేసి 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులతో పాటు, వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ర్యాగింగ్ అనేది పరిచయం పెంచుకునే లా ఉండాలి విద్యార్థులకు మద్దతుగా భావించే గౌరవం, సానుభూతి, కలుపుకుని పోయే స్వభావ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి అధికారులు, మమునూర్ ఏసీపీ తిరుపతి, డిఆర్వో విజయ లక్ష్మి, ఆర్.అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, డీయంహెచ్ ఓ సాంబశివరావు, జిల్లా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ప్రభుత్వరంగ కళాశాలల రీజినల్ కో-ఆర్డినేటర్లు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో 2 లక్షల రూపాయల

# రుణమాఫీ వెంటనే జమ చేయాలి



తల్లాడ/డిసెంబర్ 012(జర్నలిస్ట్ వార్త): రైతుల ఖాతాల్లో 2 లక్షల రూపాయల రుణమాఫీ వెంటనే జమ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అన్నారు. గురువారం తల్లాడతాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో 2 లక్షల రూపాయల రుణమాఫీ వెంటనే జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, రైతుల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, మంత్రులు సమన్వయం లేకుండా ప్రకటనలు చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు, బే షరతుగా రుణ మాఫీ చేయాలన్నారు, డబ్బులు లేవు అంటున్నారు వాగ్దానం ఎందుకు చేశారు చేసే ముందు తెలియదా అని ప్రశ్నించారు, రైతుబంధు 15000 ఇస్తామన్నారు కరిగిపోయింది రవి పోయింది ఇంతవరకు రైతుబంధు వేయలేదని విమర్శించారు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బోనస్ బాగుంది అంటున్నారు, వరి రైతుకే బోనస్ ఇస్తే మిగతా పంటలు పండించిన రైతులు, అన్యాయం అవుతున్నారన్నారు, వేరే పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా సీఎం కళ్ళు తెరిపించాలని పిలుపునిచ్చారు, సీనియర్ స్ తెలంగాణ రైస్ మిల్ నాయకులు తాత భాస్కర రావు మాట్లాడుతూ, ఆరు హామీలలో మహిళలకు బస్సు ప్రయాణం తప్ప వేరే ఏ హామీలు అమలు కాలేదు అన్నారు, పల్లెలకు బస్సులు తగ్గించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణ ప్రాంతాల మేడలే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు, పల్లె వెలుగు బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతే కెసిఆర్ ను ఇంటికి పంపినట్లే నిన్ను పంపిస్తారని సీఎం ను హెచ్చరించారు, కెసిఆర్ నియంతత్వ పోకడ పోతున్నారని విమర్శించిన రేవంత్ రెడ్డి బిల్లులు మంజూరు చేయాలని బయలుదేరిన సర్పంచ్ లను ముందస్తుగా అరెస్టు చేయడం, సమస్యల పరిష్కారం కోసం హైదరాబాదు వెళుతున్న ఆశా కార్యకర్తలను ముందస్తు రచ్చ చేయడం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ అన్నారు, గత ప్రభుత్వ ధోరణి కొనసాగిస్తే, ప్రభుత్వ పతనం తప్పదు అన్నారు,

### పోస్ట్ కార్డు ఉద్యమం

రైతులు తమ రుణాలు మాఫీలు చేయాలంటూ సీఎంవో కార్యాలయానికి పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు, తల్లాడ పూల్ పోస్ట్ ఆఫీస్ ఎదుట పోస్ట్ కార్డులను వేసి తమ నిరసనను తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి, శీలం పకీరమ్మ, పులి వెంకట నరసయ్య, కళ్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్ రావు, అయినాల రామలింగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా,

# ప్రజా పాలనా విజయోత్సవాలు




రాయపర్తి/డిసెంబర్0 12(జర్నలిస్ట్ వార్త): గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా, ప్రజా పాలనా విజయోత్సవంలో భాగ%శీ%గా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీ.ఎం .కప్ క్రీడా పోటీలు నీవహించడం జరుగుతుందని ఎంపీడీవో కిషన్ నాయక్,తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్ లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీ.ఎం .కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు ఎంపీడీవో కిషన్ నాయక్,తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమేశ్వర ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గతంలో మాదిరి కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు మార్గాలు అన్వేషిస్తుందని తెలిపారు. అద్భుత స్పందన క్రీడాకారుల నుండీ ఆటలల్లో ఊహించిన్నా దానికంటే ఎక్కువ స్పందన వచ్చిందని తెలిపారు. గెలిచిన వారు గెలుపును నిలుపుకోవాలని,ఓడిన వారు గెలుపు కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చ రమేష్, మండల మైనారిటీ సేల్ అధ్యక్షులు ఎండీ అఫ్రోజ్,పట్టణ ప్రధాన కార్యదర్శి సూదెపు శ్రీనివాస్, మండల నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి,మచ్చ కుమారస్వామి, లేతకుల యాదవ రెడ్డి,రామ,పట్టణ యూత్ అధ్యక్షులు పీరాని ప్రవీణ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉబ్బని నవీన్,దేదావత్ రామ,చిర్ర శ్రీధర్, మునవత్ రవి ,నాగరాజు,వివిధ గ్రామాల,పీటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.